# దయ్యం వదిలింది !

**మా** అక్క రేణుక కష్టజీవి. ఆమెకిద్దరు పిల్లలు. పెద్దపిల్ల విజయని ఎం.ఏ దాకా చదివించి మంచి సంబంధమే చూసి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపేశారు. రెండో సంతానం రేణుకానందన్ (మా బావ తన చరిత్ర, సాహిత్యాభిలాషలకు అనుగుణంగా ఆ పేరు పెట్టాడు. గౌతమీపుత్ర శాతకర్ణి. హిందీకవి సుమిత్రానందన్ పంత్‌ల పేర్లు మీరు వినేవుంటారు). వాడు డ్యాక్టరీ కోర్సు చదువుతున్నాడు. వాళ్ళు చదువులో ఎప్పుడూ చురుగ్గా ఉండేవాళ్ళు. మా అక్కను ఎలాంటి ఇబ్బందీ పెట్టలేదు. మా బావగారు మంచి ఉద్యోగమే చేస్తున్నారు. ఆయన ఏకపత్నీవ్రతుడే, అచ్చు శ్రీరామచంద్రుడు. అయితే ఈ శ్రీరామచంద్రుళ్ళతోనూ ప్రమాదమే. వాళ్ళు తమ మంచి తనంతో భార్యలకెన్నో కష్టాలు కలిగిస్తారు. సీతను నిర్దాక్షిణ్యంగా అడవికి పంపేసిన రాముడి సంగతేం చెప్పాలి, మీకు తెలీదు కనకనా?

పెళ్ళయినప్పటినుండి చూస్తూనే ఉంది మా అక్క. మా బావగారికెప్పుడు దయ్యం పట్టుందో, ఎప్పుడు మూడుతుందో చెప్పలేం. ఆయనకా దురద ఎప్పుడు ఎవరివల్ల అంటిందో ఎవరికీ తెలీదు. కొన్ని వంశపారంపర్యంగా వచ్చే జబ్బులుంటాయి. ఆయన తండ్రికీ, తాతకీ సాహిత్యాభిలాష వుందని విన్నా కాని, ఇలా జనాన్ని చెండుకుతినే అలవాటు ఉందని వినలేదు. కాన్సరు లాంటి వ్యాధులు వంశపారంపర్యంగా వచ్చే జబ్బులు కావట. ఇదీ అలాంటిదే అయివుండాలి. పెళ్ళికిముందు మా అక్క చాలా సంబరపడింది. వరుడు కథలు రాస్తాడనివిని. కాపురానికొచ్చింతర్వాతగాని తెలిసిరాలేదు ఆమెకు తానెన్ని కష్టాలు అనుభవించాలో. ఏం చేస్తాం, అంతా స్వయంకృతం. 'చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవ' అని ఆమె ఖర్మ అలాకాలింది. ఎవరు మాత్రమేం చేయగలరు. అక్కడికీ నేను చెప్పి చూశాను. '' దురదవున్న వాళ్ళతో వేగటం చాలకష్టమే అక్కా! నా మాటవిని పెళ్ళికొడుకు నచ్చలేదని చెప్పెయ్యి'' అని ఉచిత సలహా ఇచ్చాను. నామాటను ఆమె పెడచెవినపెట్టింది. ఫలితం దారుణం.

ఆంగ్లంలో 'ప్రెగ్నెంట్ విత్ ఐడియాస్' అంటారు చూశారూ. అలా మాబావగారికి ఆలోచనలతో ఎప్పుడు కడుపువస్తుందో చెప్పటం కష్టం. కడుపొచ్చినప్పుడల్లా చక్కని బిడ్డ పుడ్తాడని చెప్పలేం. గర్భస్రావాలవటం కద్దు. బిడ్డపుట్టేటప్పుడు లేబర్ పైన్స్‌తో యమయాతన పడిపోతాడు. సగం రాసిన కథలు, నవలలు చాలా వున్నాయి, ఆయన అలమారులో.

ఈగర్భ(స్రావాలని ఆయన పదిలంగా ఎందుకు దాచుకుంటాడో అర్థంకాదు. 'నీకు తెలీని విషయాలు ప్రపంచంలో ఎన్నో వున్నాయోయ్ హోరేషియో!' అని ఆ పెద్దమనిషెవరో షేక్స్‌పియర్ అన్నాట్ట. అయినా మానవ స్వభావం కదండీ - వూర్కో-లేకపోతున్నాను.

కథలు, నవలలు రాయటానికి 'మూడు'రావాలని మా బావగారు అంటారు. దానంతటదే మూడిచావదు. దానికి దోహద క్రియలు చేయాలట. కొన్ని సాధారణ దోహదక్రియలు, కొన్ని అసాధారణమైనవి అని రెండురకాలట. కాఫీ, సిగరెట్టు, పాన్ లాంటివి మొదటిరకం. మందు పుచ్చుకోవటం రెండోరకంట.

పెళ్ళి అయిన కొత్తల్లో 'ఈనాటి ఈ బంధమేనాటిదో, ఏనాడు పెనవేసి ముడివేసెనో' అని మాబావగారు పాడుకుంటూవుంటే మా అక్క మురిసిపోయిందట. తీరా ఆ పాడేపాట తాను తాగుతున్న సిగరెట్టునుద్దేశించి అని తెలుసుకున్న తరువాత మా అక్కకు ఆయన పొగతాగే అలవాటు మీద సవతి ద్వేషం కలిగింది. ''నాకంటే అదే ఎక్కువైంది ఆయనకి'' అని మా అమ్మదగ్గర వాపోయింది.

''చూద్దాం తల్లీ! మనిషన్న తర్వాత మార్పురాకపోతుందా దాన్ని మర్చిపోయి నిన్నే ఏలుకుంటాడేమో. నువ్వేం దిగులుపడకు. కాలమే అన్ని సమస్యల్నీ పరిష్కరిస్తుంది'' అని ఓదార్చింది మా అమ్మ.

అక్కడికీ మా బావగారితో ఓసారి పేచీ పెట్టింది మా అక్క ''అది కావాలో, నేనుకావాలో తేల్చుకోండి ముందు'' అని.

''అదంటే నాకు ప్రేమా హనీ! నువ్వే నా ఏకైక పత్నివి. కాకపోతే మూడటానికి అవసరం కదా అది. అందుకని దాన్ని పెంచి పోషిస్తున్నాను'' అన్నాట్ట ఆయన.

సిగరెట్టుతో సరిపెట్టలేదు ఆయన. కథలు రాసేటప్పుడు విపరీతంగా కాఫీతాగటం మొదలెట్టాడు. రోజుకో రెండు మూడుసార్లయితే మా అక్కా పట్టించుకునేది కాదు. గంటకు నాలుగుసార్లంటే, మూడినరోజు కనీసం ఓ పాతిక కప్పుల కాఫీ అయినా కావాల్సి వచ్చేది. కాఫీ కాచికాచి మా అక్క ముసలిదయిపోయింది. వంటింట్లోకీ, ముందు గదిలోకీ తిరిగేటప్పటికే ఆమె నడుములు పట్టేవి. ఇలాకాదని మా అక్క సమ్మెచేసింది. శ్రామికులు తమ హక్కులు కాపాడుకోవటానికి సమ్మెచేయటం న్యాయమేకదా! చేసేది లేక మానేజిమెంటు వారు అంటే మా బావ దిగిరాక తప్పలేదు. మూడినరోజు గంటకోకప్పు కాఫీ. మూడనిరోజున ముచ్చటగా మూడే కాఫీలు - పొద్దున్నే, తొమ్మిది గంటలకు ఆఫీసుకెళ్లేప్పుడు, తిరిగి సాయంత్రం, ఆఫీసునుండి తిరిగి వచ్చింతర్వాత - అని ఒప్పందం కుదిరింది. మానేజిమెంటువారు దిగిరావటంతో కార్మికులు తమ డిమాండ్లను అధికం చేస్తారు చూడండి, ఆ పద్ధతిలో మా అక్క 'సిగరెట్టు కూడా మానెయ్యాలి' అని డిమాండ్ చేసింది.

''సిగరెట్టు లేకపోతే బతకటం కష్టమ''న్నాడు మా బావగారు.

''ఏం కష్టంలేదు. నేను తాగుతున్నానా'' అంది మా అక్క.

''నీకు మూడదుగా, అందువల్ల సిగరెట్టు లేకపోయినా ఫర్లేదు. పోనీ ఓ రాజీకి వద్దాం. ఇన్నేళ్ళు వుంచుకున్నదానికి ఒక్కసారిగా విడాకులివ్వటం కష్టం. రోజుకు పది సిగరెట్లు, అంతకుమించి తాగను. అవికూడా మెల్లమెల్లగా మానేస్తాను. సిగరెట్లెక్కువ కాల్చను కనుక, మూడినప్పుడు అవసరానుగుణంగా పాన్‌వేసుకోవటానికి కార్మికవర్గం వప్పుకోవాలి'' అన్నాడు ఆయన.

ట్రేడ్ యూనియన్ మూవ్‌మెంట్‌తోగాని, యాజమాన్యపు రాజకీయ కుతంత్రాలతోగాని అంతగా పరిచయంలేని మా అక్క ఆయన వలలో పడ్డది. ''సరే'' అంది. దాంతో మా బావగారి సిగరెట్లు ఏవారం రోజులో తగ్గాయికానీ, కొత్తగా పాన్ అలవాటయింది. రెండో సవితి వచ్చినప్పటినుండీ మా అక్కకు నిద్రపట్టలేదు. మళ్ళీ చర్చలు జరిగాయి. 'పాన్ పూర్తిగా మానెయ్యాలి అనీ, సిగరెట్లు యథేచ్ఛగా కాల్చుకోవచ్చనీ' ఒప్పందం జరిగింది.

అయితే ఆయన పాన్‌కూడా పూర్తిగా మానలేదు. చాలవరకు తగ్గించాడు. సిగరెట్లు యథేచ్ఛగా ఊదేస్తుండేవాడు. నిజం చెప్పాలంటే మా అక్కకు తెలీదు మూడో సవతి సంగతి - అసాధారణ దోహద ప్రియ సంగతి. లేకపోతే గోలపెట్టేది.

సవతి పిల్లల్తో అక్క యమబాధపడేది. ఆయన రాసిన కథలు వయసొచ్చిన ఆడపిల్లల్లాంటివి. వాటికి పెళ్ళిచేయాలి. వాటిని గుండెలమీద కుంపట్లలా భరించేవాడు ఆయన. తల్లిదండ్రులు కూతురికి వీలయినంత మంచి సంబంధమే చేయాలని చూస్తారు. చెప్పులరిగేట్టుగా తిరిగినా అనుకున్నంత మంచి సంబంధం దొరక్క, కట్నాలు పోయలేక ఏదో ఓ సంబంధం చూసి ముడిపెట్టేస్తారు. మా బావగారికీ తన కథలు మంచి పత్రికల్లో రావాలనే ఉండేది. అవి తిప్పి పంపితే చివరకు 'పోనీలే గంతకుతగ్గ బొంత' అని ఏ పత్రిక్కయినా ఇచ్చి ముడిపెట్టేయాలని ప్రయత్నించేవాడు. ఒకోసారి అదీ కుదిరేదికాదు. మొగపెళ్ళవారు ఇష్టంలేకపోతే పిల్లనచ్చలేదనో, కట్నం చాలదనో, లాంఛనాలు సరిపోలేదనో, ఏదో ఓ వంక చెప్పి సంబంధాన్ని తిరగ్గొడతారు. కాని ఈ పత్రికల సంపాదకులున్నారు చూశారూ - కథల్ని గప్‌చుప్‌గా తిప్పి పంపేసి వూరుకుంటారు. పోనీ చెప్పనుకూడా చెప్పరు ఎందుకు నచ్చలేదో.

ఓసారి ఆయన కథ తిరిగివచ్చినప్పుడు నేనక్కడే ఉన్నాను.

''ఏం బావా! ఏమయింది'' అని అడిగాను ఆయన దీనవదనాన్ని చూసి.

''మీ బావ రాసిన కథ తిరిగివచ్చిందిరా'' అంది అక్క.

''ఇంకో పత్రికకు పంపితేసరి'' అని ఉచిత సలహా ఓటి పారేశాను.

''నీకేం చెప్తావు! కాళ్ళరిగిపోయాయి తిరిగి తిరిగి. గుండెలమీద కుంపటిలా వీట్నీ భరించటమెంత కష్టమో నీకు తెలీదు'' అని కసురుకున్నాడాయన.

''పెళ్ళి వయసు వచ్చిన ఆడపిల్లల తండ్రులుకూడా నీలా బాధపడరు'' అన్నాను పట్టువదలని విక్రమార్కుడిలా.

''ఆడపిల్లలుంటే తెలిసేది నీకు. పెళ్ళికొడుకులు ఎంతమందికి చూపించినా నచ్చలేదంటారు. వాళ్ళబొంద వాళ్ళకేం కావాలో తెలిసి చావదు. మీ బావగారి పరిస్థితీ అదే'' అంది మా అక్క, భర్త బాధ సానుభూతితో అర్థం చేసుకున్న అర్ధాంగిలా.

''అవునోయ్ శేఖరం! కష్టపడి కల్పనచేశాను కదా! వాటికి ముడిపెడితే నాకూ మనశ్శాంతి. మొన్న తిరిగివచ్చింది చూశావు 'గాడిద గుడ్డు' కథ. ఎన్ని పత్రికలకు పంపినా తిరిగివస్తోంది. ఎవరికీ నచ్చటంలేదు. అసలు దానికి ముడిపడే యోగముందో లేదో'' అని ఉస్సురన్నాడు. ఆయన.

ఒకోసారి కథలు పబ్లిష్ అయేవి. పత్రికలకు స్పేస్ ప్రాబ్లం. చిన్నకథను కాలందాటని కథల స్థాయికి దించేశారు. పైగా అది రాయటానికి ప్రతిభ వుండాలనీ చెప్తారు. స్పేస్ ప్రాబ్లం వల్ల కథని కుదించి ఎడిట్ చేసి ప్రచురించే వాళ్ళు. అలాంటప్పుడు మా బావగారు తన కూతుర్ని అత్తింటివారు కిరసనాయిలు పోసి నిప్పంటించినంత బాధపడేవాడు. అప్పుడు ఆయన్ని పట్టటం కష్టం. ఇలా ఆ బాధలనుభవించీ, అనుభవించీ 'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్, ఆ ఎరుకే నిశ్చలానందమోయ్, బ్రహ్మానందమోయ్' అన్నస్థితికి వచ్చాడు.

ఇలా అష్టకష్టాలు పడ్తూ మా బావగారు ఎదిగాడు. ఈమధ్య ఆయన నవలలు రాయటం మొదలెట్టాడు. నవలంటే మాటలా? నవమాసాలు మోసి కనే స్త్రీ కూడా అంత ప్రసవవేదన పడదు. ఆ రోజుల్లో ఆయన సరిగ్గా నిద్రపోడు. పరధ్యానంగా ఉంటాడు. ఇంటి విషయాలు పట్టించుకోవటం ఎప్పుడూ లేదనుకోండి. దీనికితోడు కూతుర్ని కూడా పురుటికి తీసుకవచ్చింది మా అక్క. ఇద్దరు చూలాళ్ళతో మా అక్క సతమతమయేది. పైగా వేవిళ్ళు. సరే మా విజయకు సహజమేననుకోండి. ఈయన రాత్రిళ్ళు నిద్రకాచి టీలు, సిగరెట్లు తాగి పడక వాంతి చేసుకునేవాడు. ఇద్దరికీ అనుపానాలిచ్చి 'భయంలేదు, ఈ సమయంలో ఇలాంటివి సహజమే' అని నచ్చచెప్పేసరికి తలప్రాణం తోకకు వచ్చేది మా అక్కకు. ఆ వేవిళ్ళలోనే ఇద్దరికీ గొంతెమ్మ కోర్కెలు, అది చేసిపెట్టమనీ, ఇది చేసి పెట్టమనీ. మా అక్కకు క్షణం తీరికవుండేదికాదు. పగలు కూతురు, రాత్రి మా బావ- ఆమెను వేపుకు తినేవారనుకోండి.

చివరకు మా బావగారు, విజయ పండంటి పిల్లల్ని కన్నారు.

అంతకష్టపడి రాసిన నవలను ఓ పేరొందిన పత్రిక్కే పంపాడు ఆయన. పంపిన రోజునుండి వాళ్ళు ఏమంటారా అని ఎదురుచూశాడు. అది దుర్భరనిరీక్షణ. అల్లుడు కూతుర్ని 'నీకూ నాకూ పడటంలేదు. విడాకులిచ్చేశాను. మీ పుట్టింటికి వెళ్ళిపో' అన్న పద్ధతిలో నవల రెండు నెలల్లో తిరిగి వచ్చింది.

అప్పుడు ఆయన్ని పట్టటం దుర్భరమయింది. కూతురి కాపురం కూలిపోయినందుకు ఆయన రెండుమూడురోజులు బయటి ప్రపంచాన్ని చూడలేదు. పెద్దకూతురు విజయ తన కొడుకును ముద్దుముచ్చటలాడటం చూసి ఆయనకు మండిపోయింది. సహజమేకదా! ఇద్దరూ ఒకేసారి కన్నారు. విజయ తన కొడుకుని మురిపెంగా చూసుకోవటమేంటి? తను తన శిశువును భూస్థాపితం చేయాల్సి రావటమేంటి?

''దాన్నిహ అత్తవారింటికి పంపెయ్యి'' అన్నాడోరోజు మా బావగారు విజయను, దాని కొడుకుని చూసి ఓర్చుకోలేక.

''అదేం మాటండీ, ఇంకా పచ్చిబాలింత, బాబుకు ఆర్నెల్లు నిండనివ్వండి పంపుదాం'' అంది మా అక్క.

''దానికేం అది బాగానే ఉంది. నా బతుకే బుగ్గయిపోయింది'' అని వాపోయాడాయన.

''ఓర్చుకోవాలి మరి. దాన్ని చూసి అసూయపడితే ఏం ప్రయోజనం'' అంది మా అక్క.

''బాగుంది నాకెందుకసూయ అదంటే?'' అన్నాడాయన.

''చెప్పకులే నాన్నా! నన్నుచూసి కుళ్ళిపోతున్నావు. నేను రేపు మా ఇంటికి వెళ్ళిపోతాను'' అంది కోపంగా విజయ.

విజయ మర్నాడు అత్తింటికి పోతున్నా మర్యాదకక్కూడా వుండమనలేదు మా బావగారు.

మా బావగారి గదిలో ఓ పెద్ద అలమారు ఉంది. అది పెద్ద మాజోలియం. పెర్సీబ్రౌన్ సయ్యదులు. లోడీల కాలపు భారతీయ వాస్తుకళను గూర్చి ప్రస్తావిస్తూ ఢిల్లీ పరిసర ప్రాంతాన్ని 'ఎ వాస్ట్ నెక్రోపోలిస్'గా అభివర్ణించాడు. ఆయన అలమారూ అంతే. అందులో ఐదు అరలున్నాయి. క్రింది రెండు అరలు గర్భస్రావమయిన పిండాల సమాధిస్థలాలు. సగం రాసిన కథలు, నవలలు ముందుకు సాగక ఆ జాబితా కిందకువస్తాయి. మూడవ అర శిశువు మృతదేహాలకు కేటాయించింది. అంటే ఎక్కడా చెలామణి కాని కథలు, కథానికలు అక్కడ సమాధవుతాయి. చివరి రెండూ నవలలకు ప్రత్యేకం.

ఈ ఖనన సంస్కారం కూడా మాబావగారు చక్కటి అభిరుచితో చేస్తాడు. తిరిగివచ్చిన నవలను, కథను కొత్త కవరులో వేసి, సీలువేసి, దాని చుట్టూతా సిల్కు రిబ్బన్‌తో కట్టి ప్రేమగా, బాధగా ఆయా సమాధుల్లో వుంచుతాడు. పూలకు బదులు రెండు నాఫ్తలీన్ వుండలు వుంచుతాడు. ఖనన సంస్కారం జరిగే రోజు ఆయన భోంచెయ్యడు. ప్రియమైన సిగరెట్టుకూడా విసర్జిస్తాడు. ఆ రోజు ఇంట్లో నవ్వటంకాని, జోకులు వేయటం కాని జరుగరాదు. మూడురోజులు నల్ల ఉడుపులు (మోర్నింగ్ డ్రస్) ధరిస్తాడు. బయటికెళ్ళడు. టేప్ రికార్డర్‌లో ఘంటసాల పాడిన భగవద్గీత వింటూ బిడ్డల ఆత్మశాంతికి మౌనం పాటించేవాడు. ఆయన

నల్లగుడ్డలు చూసి ఇంటికి వచ్చిన వాళ్ళు అడిగేవాళ్ళు ''ఏమండీ! అయ్యప్ప స్వామి దీక్ష పట్టారా'' అని. ఆయన ఆ మూర్ఖుల వంక విచిత్రంగా చూసేవాడు. ఏం మాట్లాడేవాడుకాదు.

ఖనన సంస్కారమయింతర్వాత బీరువా తలుపులు మూసి, తాళంవేసి ''ఇక నేను ఛస్తే రాయను'' అనుకునేవాడు. అది స్మశాన వైరాగ్యమే లేండి.

''ఇంకెక్కడయినా ప్రయత్నించు బావా!'' అన్నా వినకుండా తిరిగివచ్చిన నవలను కూడా యధావిధిగా సమాధిచేశాడు. ఆరోజు రాత్రి డాబామీద నిలబడి, నీరవనిశ్శబ్ద నిశీధిలో ఆయన

'చీకటిలో కారుచీకటిలో కాలమనే కడలిలో
శోకమనే పడవలో ఏదరికో, ఏదెసకో ॥చీకటిలో॥
జాలరి వలలో చేపవు నీవె,
గానుగ మరలో చెరకువునీవే,
లేరెవరూ నీకెవరూ, ॥చీకటిలో॥
అని ఆయన పాడుకుంటుంటే నా మనసు ద్రవించిపోయింది.

ఇంత ప్రసూతి వైరాగ్యం, స్మశానవైరాగ్యం అనుభవించాడు కదా, ఇక రాయటం మానేస్తాడని మేం భ్రమలో పడ్డాం. ఆయన త్వరలోనే కోలుకున్నాడు. మళ్ళా రాయటం మొదలెట్టాడు. కొన్ని నవలలు ఆయనవి ప్రచురితమయ్యాయి. ఈమధ్య సంచలన రచయితగా కూడాపేరు తెచ్చుకుంటున్నాడు. ఇలా ఏడాదికి మూడు నవల్లూ ఆరు కథలుగా హాయిగా జీవితం గడుపుతున్న కాలంలో ఆశనిపాతంలా మా బావగారు కథలూ గట్రా రాయటం మాని అస్త్ర సన్యాసం చేయాల్సిన ఘోర సంఘటన జరిగింది.

ఓరోజు మా బావగారికోసం ఓ 'టున్ టున్' లాంటి పిల్ల వచ్చింది. ఇరవై ఏళ్ళుంటాయేమో. పిల్ల మొహం బానేవుంటుంది. కొంచెం లావు. ఆ సమయంలో మా బావగారు గదిలో కూర్చుని కథాకళి సాగిస్తున్నాడు. నేను ఆమెకు ఆయనున్న గది చూపించాను.

''హాయ్ నా దైవమా! నాజన్మ తరించింది, నా కలలు ఫలించాయి...'' అంది వెళ్తూనే.

మా బావగారు తలెత్తి కళ్లజోడు లోంచి 'ఎవరునువ్వు' అన్నట్టు చూశాడు.

''నేను మీ అభిమానిని. మీ సంచలనాత్మక నవలలు, చదివి జన్మసాఫల్యం పొందినదానిని'' అంది ఆ వాగుడుకాయ.

''మీ పేరు?'' అన్నాడు ఆయన.

''అసలు పేరు 'నూకాలు' నాకాపేరు నచ్చలేదు. మార్చుకుందామనుకుంటున్నా మంచిపేరు ఏదయినా సజెస్ట్ చేయండి'' అంది.

''ఇట్స్ సింపుల్. మీ పేరు తిరగేసి 'లుకానూ' అనండి. ఫారెన్ సరుకులా వుంటుంది.''

''హాయ్ నారాజా! ఇంత తేలిగ్గా సమస్యని ఇట్టే తేల్చేసిన వాళ్ళెవరూ లేరు. అందుకనే మిమ్మల్ని 'కథా బ్రహ్మ' అన్నారు.''

''ఏదో లెండి. మీబోటి అభిమానుల ఆదరం. అంతకంటే ఏంలేదు'' అన్నాడు ఆయన సిగ్గులు వలకబోస్తూ.

''మీరు నాకు నచ్చారు. మీ నవలలు చదివినప్పుడు నా ఒళ్ళు ఉద్రేకంతో వణికిపోతుంది. ఎన్నాళ్లినుంచో మిమ్మల్ని చూడాలనుకుంటున్నాను. ఇవాల్టికా కోరిక తీరింది. ఐలవ్ యు. ఐ అడోర్ యు. మరి వస్తాను. మళ్ళీ వస్తాను కాస్తంత తీరుబాటుగా మీతో మాట్లాడాలి''

''అలాగే లూకానూ! మీకెప్పుడూ స్వాగతమే''

''ఏదీ మళ్ళీ ఒక్కసారి మీనోటితో అలా పిలవరూ'' అంది గోముగా.

''లూకానూ! లూకానూ!''

''హాయ్ నా స్వీట్ ప్రభవా! విభవా! రక్తాక్షి! క్రోధన!'' అని ముందుకి వంగి మా బావగారి తల లంకించుకుని ఓ ముద్దు పెట్టుకుని ''టాటా, ఛీరియో'' అంటూ వెళ్ళిపోయింది లూకానూ.

ప్రభవ, విభవ వగైరా తెలుగు సంవత్సరాల పేర్లు మా బావగారు తన హీరోలకు పెట్టిన పేర్లు. మా బావగారికి ఆ కిస్ కసుక్కున దిగినట్లయింది. నుదుటిమీద బాధతో విలవిల్లాడాడు ఆయన.

ఆ తరువాత లూకాను చాలా సార్లు వచ్చింది. ఆమె రావటం మా బావగారికి నచ్చింది కాని ఆ పార్టింగ్ కిస్ తల్చుకుంటేనే ఆయనకు భయమేసేది.

ఆ షాక్ ట్రీట్‌మెంట్లతో ఆపలేదు లూకానూ. ప్రేమలేఖలు రాయసాగింది.

''హాయ్ చిత్రభాను!

మిమ్మల్ని చూసిన కాడినుండి నా మనసు మనసులో లేదు. ఏపనిలోను మనసు లగ్నం కావటంలేదు. నిద్రపట్టటంలేదు. పుస్తకం తెరిస్తే మీరూపే. బస్సు ఎక్కితే అందరిలోనూ మీరే కన్పిస్తున్నారు. పొరపాటున మొన్నొకాయన్ని మీరనుకుని కౌగిలించుకోబోయాను. రోడ్డుమీద ఏ బిచ్చగాణ్ణి చూసినా వాడిలో మీరే కనిపిస్తున్నారు. బాధా సర్పద్రష్టుల్ని చిత్రించిన మీరు నా కందరిలో కన్పిస్తున్నారు. మొన్నామధ్య ఎగ్జిబిషన్ వెళ్ళినప్పుడు జైంట్ వీల్ ఎక్కాను. మీరు 'ప్రేమ పిడుగు' నవల్లో రాసినట్టుగా హీరోయిన్ ఆశ్లేష జయింట్ వీల్‌నుండి దూకితే హీరో రుధిరోద్గారి ఆమె నేల మీద పడేలోపలే ఆమెను పట్టుకుని కాపాడటం గుర్తుకొచ్చింది. నేనూ పైనుండి కిందకు

దూకుదామనుకున్నాను. మీరు పక్కన లేరని అప్పటికి వాయిదా వేశాను. మనం ఎప్పుడు జైంట్ వీల్ ఎక్కి ధూకుదాం రుధిరోద్గారి?

మీ - లుకానూ''

ఇలా ఘాటు ఘాటుగా ప్రేమలేఖలు రాసాగాయి. ఓసారి రాసింది.

''మిమ్మల్ని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. మీరు పెళ్ళయిన వారయినా నాకభ్యంతరం లేదు. మనసులు కలిసి తనువులు కలియకపోవటం అన్యాయం. ఈ విషయం మాట్లాడటానికి రేపాదివారం ఐదింటికి మీ ఇంటికొస్తాను'' అని.

మా బావగారికి భయమేసింది. ఆరోజల్లా ఇంట్లో వుండకుండా స్నేహితుడింటికి పోయి మర్నాడు పొద్దున తిరిగివచ్చాడు. ఆపిల్ల వచ్చి, పాపం నిరాశచేసుకుని వెళ్ళిపోయింది. అయితే ఆమె అంతటితో వదల్లేదు. ముందు సూచననివ్వకుండా మరి రెండురోజులకు వచ్చింది. ఆరోజు మా బావగారు ఆమెను అంతదూరంలో చూడగానే వెంటనే అక్కను పిల్చి పక్కన కూర్చోపెట్టుకున్నాడు. మా అక్కకన్నీ కష్టాలే. క్లిష్టపరిస్థితి తటస్థమయినప్పుడల్లా ఆమెను ముందుకు తోసి ఆయన వెనక్కు తగ్గుతాడు. ఆ లుకానూ రాంగానే మా అక్క ఉతికి ఝాడించి ఎండేసింది.

''నీకేం పోయేకాలమొచ్చిందే లుకానూ! దయ్యంలా పట్టావు ఆయన్ని! దొరక్క దొరక్క మా ఆయనే దొరికాడా నీకు? బజార్లో పోయే ప్రతి అడుక్కుతినే వాడిలోనూ మా ఆయన కన్పిస్తాడని రాశావుగా, ఏ అడుక్కుతినేవాడినో కట్టుకో, ఫో! మళ్ళీ మా ఇంట్లో అడుగుపెట్టావంటే మా డాబా నుండి కిందకి విసిరేస్తాను'' అంది మా అక్క.

''అట్లాచేయకు అక్కా! అసలే పిల్ల కొంచెం లావా! కిందకు విసిరేస్తే గుమ్మడికాయలా పదహారు చెక్కలవుతుంది. అవి మళ్ళీ అతుక్కునే ప్రమాదముంది. కిరసనాయిలు పోసి తగలెడ్దాం'' అని సలహా ఇచ్చాను నేను.

''ఆమె ఉసురు మనకెందుకు. పోనీ సైనైడ్ ఇస్తే గుట్టుచప్పుడు కాకుండా పోతుంది కదా!'' అన్నాడు మా మేనల్లుడు రేణుకానందన్.

''మీరు ఎదురుగుండా కూర్చుని నన్ను ఇన్ని మాటలు అనిపిస్తారా? ఇదేనా ప్రేమంటే. నాది అమరప్రేమ. చంపినా చావదు, దుందుభీ!'' అంటూ గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

ఆ తరవాత ఇంటికి రావటం మానేసింది కానీ ఆఫీసులో వేళాపాళా లేకుండా వచ్చి ఆయన్ను సతాయించడం మొదలెట్టిందట. ఆఫీసులో పరువుతీస్తోందట. ఆ పిల్లను ఎలా తప్పించుకోవాలో తోచక దిగులుతో మా బావగారు చిక్కిశల్యమయ్యాడు. అన్నం తినటం మానేశాడు. ఆఫీసుకు వెళ్ళాలంటే భయం. శలవుపెట్టసాగాడు. మూణ్ణెల్లుగా ఒక్క నవల కాదుకదా, కథకూడా

రాయలేకపోయాడు. ఈ అత్యాయక పరిస్థితిని సమీక్షించటానికి ఓ రోజు మేమందరం సమావేశమయ్యాం.

''ఎట్లారా తమ్ముడూ! మీ బావగార్ని ఎలా కాపాడదాం. అసలే చిక్కిపున్నారు. ఆ రండోలు పిల్ల వచ్చి ఒక్కసారి ఈయన్ని కౌగిలించుకుందంటే నుగ్గునుగ్గయిపోతారు. ఏం దారిరా నాయనో'' అంది మా అక్క.

''అక్కా! నేనున్నా నువ్వేం భయపడకు'' అని అభయహస్తమిచ్చాను.

''దానికేం పోయే కాలమొచ్చిందోరా బాబు! దుండు ముక్కలావున్నావు నీవెంటయినా పడిందికాదు అది. నాకున్న ఒక్క మొగుణ్ణీ పోగొట్టుకు ఎలా బతకాలిరో నాయనో?'' అని శోకాలు పెట్టసాగింది.

''ఎందుకే అమ్మా అంత ఇదవుతావు. మన ఖర్మ ఎలావుంటే అలా అవుతుంది'' అన్నాడు మా మేనల్లుడు.

''బావా! ఇన్ని కథలు గట్రా రాశావు గదా! ఏమన్నా ఉపాయం నువ్వే చెప్పరాదూ'' అనడిగాను.

ఆయన అయోమయంగా నావంక చూశాడు.

''ఆయన్నెందుకడుగుతావురా. ఆయనకు మనసు మనసులో లేదు. ఆ పిల్ల ప్రేమలో పడి పోయాడు ఆయనకూడా! నా కొంప కూలిపోయిందిరా నాయనో'' అంటూ మరో శోకం పెట్టింది అక్క.

''ఛఛ అట్టా బావ శీలాన్ని శంకించకే, ఆయన శ్రీరామచంద్రుడిలా ఏకపత్నీవ్రతుడు. నీకనుమానంగా వుంటే నిప్పులు తొక్కయినా ప్రమాణం చేస్తాడు'' అన్నాను.

అక్కడికి మా అక్క కొంత స్వాంతనపొందింది.

''ఓపని చేయండి. ఓ ఆర్నెల్లు బావగారు శలవుపెడ్తారు. ఇద్దరూ తీర్థయాత్రలు చేసిరండి. ఓ రెండు నెలల్లో బావగారు రాస్తున్న సీరియల్స్ అయిపోతాయి. కొత్తవి రాకపోతే ఆ పిల్ల ప్రేమ జ్వరం తగ్గిపోవచ్చు. ప్రస్తుతానికి ఇంతకంటే మార్గంలేదు'' అన్నాను.

నా సలహా అందరికీ నచ్చింది. మర్నాడే మావాళ్ళు తీర్థయాత్రలు చేసిరావటానికి ప్రయాణం కట్టారు. నా అంచనా కరెక్ట్ అయింది. మా బావగారి సీరియల్స్ రాకపోవటంతో టెంపరేచర్ తగ్గినట్టుంది. ఆ పిల్ల అయిపు లేదు. మావాళ్ళు తీర్థయాత్రలు చేసి తిరిగివచ్చారు భయపడ్తూనే. ఆయన ఆఫీసుకు వెళ్తూనే ఉన్నాడు. 'వెనుకటి గుణమేలమాను' అన్నట్లు మా బావగారెప్పుడయినా కలం పట్టుకున్నాడో ''అదుగో లుకానూ'' అని భయపెట్టేవాళ్ళం. అలా ఆయనకు పట్టిన దయ్యం వదలసాగింది. మనిషి పూర్తిగా మారిపోయాడు. ఇహలోకంలో

పడ్డాడు. ఇప్పుడో పిచ్చి కథ రాయాలన్నా భయమాయనకు. మా అక్క కష్టాలుగట్టెక్కాయి. ఆమెకు విముక్తి లభించింది.

సంవత్సరం తర్వాత 'లుకానూ' నుండి ఉత్తరం వచ్చింది.

''జేష్ట పెద్దమ్మా! (జ్యేష్ఠ - అని మా బావగారి నవలల్లో ఓ పాత్రపేరు) ప్రేమ జైంట్ వీల్ ఎక్కటానికి నువ్వు పనికిరావు. నా ప్రేమని అపాత్రదానం చేసినందుకు చింతిస్తున్నాను. నువ్వొట్టి హెన్‌పెక్‌డివి. ప్రేమించటానికి భార్య పర్మిషన్ తీసుకునేవాణ్ణి మరేమంటారు? నీ ప్రేమ దయ్యం వదిలి నేను ఇప్పుడు హాయిగా వున్నాను. ఇప్పుడు కొత్త దుమారంలో కొట్టుకువచ్చిన 'కంకాళం' గార్ని ఆరాధిస్తున్నాను. ఆయన నాపేరును ఇంకా సంచలనాత్మకంగా 'లునూకా'గా మార్చారు. బావుందా? ప్రేమించలేని దద్దమ్మవు నువ్వు ఇంక రచనలు సాగించావో నా ఆత్మ నిన్ను దయ్యమై పట్టి పీడిస్తుంది గుర్తుంచుకో.

నీ కెప్పటికీ దక్కని

లునూకా''

''లుకానూ వదిలింది కదా! ఇంక నేను రాయొచ్చుననుకుంటాను'' అన్నాడు మాబావగారు ఆ ఉత్తరం చూసి.

''ఇంక మాట్లాడకండి అది దయ్యమై పడ్తుంది. ఈ 'లుకానూ' కాకపోతే ఇంకో 'నూలుకా' పడ్తుంది. ఈ దయ్యాల్ని వదిలించటం నావల్లకాదు'' అంది మా అక్క. ఆయనింక కిక్కురుమనలేదు.

అలా మా బావ దయ్యం వదిలింది.

'ఈనాడు' ఆదివారం

31-12-1989